క్లుప్తంగా

ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయండి

కలకడ : జగనన్న కాలనీలలో ఇంటి నిర్మాణాలు వేగవంతం చేసి, వెంటనే పూర్తి చేయాలని ఎంపీపీ శ్రీదేవి కోరారు. బుధవారం మండలంలోని కలకడ, కె.బాటవారిపల్లె పంచాయతీలలో పర్యటించి మౌలిక వసతులపై ఆరా తీశారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సిమెంట్, నిర్మాణ సామగ్రిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్‌లు, వైఎస్సార్‌సీపీ నాయకులు జిలానీబాష, షావత్‌అలీఖాన్, పంచాయతీ కార్యదర్శి నందిని పాల్గొన్నారు.

ఈ-పంట నమోదుతో బహుళ ప్రయోజనాలు

కేవీపల్లె : రైతులు విధిగా ఈ-పంట నమోదు చేసుకోవడం వలన బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఏడీఏ వై.వి. రమణరావు అన్నారు. బుధవారం మండలంలోని గోరంట్లపల్లె, గ్యారంపల్లెలో రబీలో సాగు చేసిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో సాగు చేసిన ప్రతి పంటను నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి శ్రావణి, సర్పంచ్ రెడ్డెయ్య, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలు

వాల్మీకిపురం : షిరిడిసాయి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన లభించింది. తిరుపతి అరవింద్ కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన శిబిరంలో 87మందికి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. వీరిలో 25 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు డాక్టర్లు అపూర్వ, అర్చన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చింతల ఆనంద రెడ్డి, నీళ్లభాస్కర్, మధనమోహన్ రెడ్డి, శంకరాచారి, శంకర, సత్య, సిబ్బంది పాల్గొన్నారు.

పాల సేకరణ ప్రారంభం



పాల సేకరణ కార్యక్రమం ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ములకలచెరువు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక మండల కేంద్రం బీఎంసీయూ కేంద్రంలో పాడి రైతుల నుంచి పాల సేకరణ ప్రారంభించారు. జిల్లా పశుసంరక్షణ అధికారి గుణశేఖర్, ఏడీ గోవింద్ నాయక్, ఎంపీపీ సాయిలీలా, సర్పంచు రహమత్‌బీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల వ్యాప్తంగా పాల సేకరణ కేంద్రాల నుంచి పాల ఉత్పత్తి పెంచేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలని వారు పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లె : అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు స్థానిక ఎస్‌ఐ ఫాతిమా తెలిపారు. రాచవేటివారిపల్లె పంచాయతీ మాలపల్లెకు చెందిన రెడ్డెప్ప కుమారుడు వీరనాల వెంకటరమణ(52) కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తీసుకువచ్చి గ్రామంలో విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో బుధవారం దాడి చేసినట్లు తెలిపారు. గ్రామ సమీపంలో మద్యం టెట్రా ప్యాకెట్లను అక్రమంగా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 25 టెట్రా ప్యాకెట్లు, రూ.1,399 నగదు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

డిప్లొమా కోర్సులతో ఉపాధి అవకాశాలు

మదనపల్లె సిటీ: డిప్లొమా కోర్సులతో ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా అన్నారు. బుధవారం కురవంకలోని ఎస్‌జీఆర్ పారా మెడికల్ జూనియర్ కాలేజీని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలేజీలో డిప్లొమా కోర్సులు అనుమతి ఇవ్వడం అభినందనీయమన్నా రు. ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ ఉద్యోగాలకు నోటి ఫికేషన్లు ఇస్తున్నట్లు తెలిపారు. డిప్లొమా కోర్సుల వల్ల చాలా మందికి సచివాలయ ఉద్యోగాలు వచ్చినట్లు తెలిపారు. కరస్పాండెంట్ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాఖ్య స్ఫూర్తికి తార్కాణం రాజ్యాంగం

కురబలకోట: సమాఖ్య స్ఫూర్తికి దేశ రాజ్యాంగం తార్కాణంగా నిలుస్తోందని 100 డ్రీమ్స్ సంస్థ అధ్యక్షులు, జెట్టి సినీ హీరో మాన్యం కృష్ణ పేర్కొన్నారు. బుధవారం అంగళ్లులోని గోల్డన్‌వ్యాలీ కళాశాలలో యువ తరంగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విభిన్నమైన, పటిష్టమైన మన రాజ్యాంగం ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకుందన్నారు. హక్కులు, బాధ్యతల పట్ల ప్రజలను చైతన్య పరిచాలన్న లక్ష్యంతో యువ తరంగ్‌కు శ్రీకారం చుట్టామన్నారు.

సినిమా థియేటర్లలో పరిశుభ్రత పాటించాలి

తంబళ్లపల్లె: ప్రభుత్వ నిబంధనల మేరకు పరిశుభ్రత పాటించాలని ఎంపీహెచ్‌ఈఓ సరళ సూచించారు. బుధవారం విజయ సినిమా థియేటర్‌ను తని ఖీ చేశారు. మరుగుదొడ్లు, మూత్ర విసర్జనశాలలు పరిశీలించారు. థియేటర్‌లో పరిశుభ్రత తప్పనిసరన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఎంపీహెచ్‌ఎస్ బాలపెంచులయ్య, సీహెచ్‌వో సుమతి, రమణ ఉన్నారు.

సంక్షేమ రాజ్యం సీఎం జగన్‌తోనే సాధ్యం

- మేనిఫెస్టోలో 98 శాతం హామీలు పూర్తి
- 32వవార్డులో గడప గడపకు మన ప్రభుత్వం
- ప్రభుత్వ పథకాలను వివరించిన ఎమ్మెల్యే నవాజ్‌బాషా



ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : సంక్షేమ రాజ్యం సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. పట్టణంలోని 32వవార్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా చైర్‌పర్సన్ మనూజారెడ్డితో కలిసి వార్డులో ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నామని చెప్పారు. గతంలో ప్రభుత్వ పథకాలు మంజూరు కావాలంటే ప్రభుత్వ కార్యాలయాలు, జన్మభూమి కమిటీ సభ్యుల చుట్టూ తిరగాల్సి వచ్చేదని ఇప్పుడా పరిస్థితి లేదన్నారు. గ్రామ, వార్డు సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా జగనన్న మెరుగైన పాలన అందిస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో జగనన్నకు ప్రజలంతా అండగా ఉండి మరోసారి సీఎంగా గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా వార్డులో ప్రజల నుంచి పలు సమస్యలు తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. ఎన్నికల ముందు రెండుపేజీల మేనిఫెస్టోతో ప్రజల ఓట్లు అడిగిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా నెరవేర్చి మాట నిలుపుకున్నారన్నారు. దేశంలోనే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటిస్తూ.. అర్హతే ప్రామాణికంగా అందరికీ న్యాయం చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. ప్రజలకు మంచిచేసేందుకు ముఖ్యమంత్రి ప్రతి క్షణం ఆలోచిస్తుంటే.. ప్రజలను ఎలాగైనా మభ్యపెట్టి అధికారంలోకి రావాలని చంద్రబాబు, పవన్‌కల్యాణ్ ప్రయతిస్తున్నారన్నారు. ఎవరి ప్రభుత్వంలో ప్రజలకు మంచి జరిగింది.. ఎవరు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు.. ఎవరి కష్టాలు, ఇబ్బందుల్లో అండగా నిలిచారనేది ప్రజలందరికీ తెలుసన్నీరు. మంచి చేసిన ప్రభుత్వాన్నే మళ్లీ మళ్లీ కోరుకుంటారు తప్ప మోసం చేసిన నాయకులను గుర్తుపెట్టుకోరన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మేస్త్రీశ్రీనివాసులు, ఎస్.కరీముల్లా, భాను, రేణుక, కోఆప్షన్ శారదారెడ్డి, వైస్ ఎంపీపీ నందినితాజ్, వైఎస్సార్ సీపీ నాయకులు బండిమనోహర్, కరమల హేమంత్‌రాజు, సోమశేఖర్‌రెడ్డి, రవి, రహీం, జాన్‌బాబు, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లడుతున్న డీవైఈఓ కృష్ణప్ప

రామసముద్రం: రామసముద్రం జెడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం మదనపల్లె డీవైఈఓ కృష్ణప్ప ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. అకాడమిక్ పరంగా ఉపాధ్యాయులు ఎల్‌ఐపీ, పిల్లల ఉన్నతి కోసం కృషి చేయాలన్నారు. 10 వ తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. సమయం వృథా కాకుండా చక్కగా చదువుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలు సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పిల్లలకు ప్రశ్నలు వేసి వారి నుంచి సమాధానం రాబట్టారు. విద్యార్థుల సమాధానాలకు సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ హేమలత, హెచ్‌ఎం గాయిత్రి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బీటీ ప్రభుత్వ కళాశాల సిబ్బంది సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ సుధాకరరెడ్డి, కృష్ణవేణి

మదనపల్లె : పట్టణంలోని బిసెంట్ థియోసఫికల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి సంబంధించిన విద్యార్హత, సర్వీస్, ఇతర సర్టిఫికెట్లను కడప ఆర్‌జేడీ ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ సుధాకరరెడ్డి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి పరిశీలించారు. బుధవారం సాయంత్రం కళాశాలలో టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి సంబంధించి, గతంలో త్రీమెన్ కమిటీ ఇచ్చిన జాబితా ఆధారంగా ఒకొక్కరి సర్టిఫికెట్లను పరిశీలించారు. గతంలో ఎయిడెడ్ కళాశాలగా ఉన్న బీటీ కళాశాలను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్న విషయం విదితమే. అయితే బీటీ కళాశాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న సమయంలో పని చేస్తున్న టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బందికి సంబంధించి ప్రభుత్వంలో చేరికపై పలు ఆరోపణలు, అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. సర్టిఫికెట్ల పరిశీలన ప్రాధాన్యతను సంతరించుకుంది.

జాతీయ స్థాయిలో మిట్స్ విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రం చూపుతున్న విద్యార్థులు

కురబలకోట: అంగళ్లులోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు అన్వేషణ కార్యక్రమంలో జాతీయస్థాయిలో రాణించి మూడు బహుమతులను అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కుప్పం ఇంజినీరింగ్ కళాశాలలో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్, సైనాప్సిస్ కంపెనీ నిర్వహించిన అన్వేషణ కార్యక్రమంలో విద్యార్థులు సుస్మిన్దారెడ్డి, హరీష్‌కుమార్, ఉమేష్ చంద్ర, హేమంత్ స్మార్ట్ గ్లాసెస్ ఫర్ బ్లైండ్ పీపుల్ అనే ప్రాజెక్టుకు ఈ బహుమతులు లభించినట్లు తెలిపారు. ప్రశంసా పత్రాలతో పాటు రూ.10 వేలు నగదు అందజేశారన్నారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ దుర్గాచరణ్ ఆధ్వర్యంలో వీరు బహుమతులు సాధించినట్లు తెలిపారు.

ఓటరుకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి



మాట్లాడుతున్న తహసీల్దార్ రవి

పీలేరురూరల్ : ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని తహసీల్దార్ రవి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బూత్‌లెవెల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 63,050 ఓటర్లు ఉండగా ఇప్పటి వరకు 42 వేలు అనుసంధానం పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలినవి గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. 18 సంవత్సరాలు వయస్సు నిండిన యువతీ యువకులు తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎన్నికల డీటీ కిరణ్, ఏఎస్‌వో రామ్మోహన్ పాల్గొన్నారు.

వైభవంగా శివలింగ ప్రతిష్టాపన



అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పెద్దతిప్పసముద్రం: మాఘమాసం శుక్లపక్షం ఏకాదశి సందర్భంగా బుధవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో స్థానిక చంద్రమౌళేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త క్రమధాటి చంద్రశేఖర్, ఆలయ నిర్వాహకులు సనగరం పట్టాభిరామయ్యల ఆధర్యంలో శివలింగం, నంది ప్రతిష్టాపన కార్యక్రమాలను కన్నుల పండువగా నిర్వహించారు. అదే విధంగా టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లి సమీపంలోని పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన పార్వతీ సమేత సంఘమేశ్వర స్వామి ఆలయంలో ఆడిటర్ మంజునాథ్, ఆలయ కమిటీ సభ్యులు పీ. శ్రీనాథ్‌రెడ్డి దంపతుల సమక్షంలో వేద పండితుల మంత్రోఛారణల నడుమ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ



పూజలు నిర్వహిస్తున్న హరీష్‌రెడ్డి తదితరులు

పీలేరు : మండలంలంలోని వేపులబైలు పంచాయతీలో శ్రీ అంకాలమ్మ ఆలయం నిర్మాణానికి భూమి నిర్వహించారు. జంగంపల్లె సమీపంలో ఇది వరకు ఉన్న అంకాలమ్మ ఆలయం జాతీయ రహదారి నాలుగు లేన్ల విస్తరణలో కోల్పోతుండడంతో గ్రామస్తులు నూతన ఆలయానికి శ్రీకారం చుట్టారు. బుధవారం ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తమ వంతు సహకారం ఉంటుందని తెలిపారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భవనం వెంకటరమణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగభూషణంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, సర్పంచ్ చెంగల్‌రాయుడు, ఉప సర్పంచ్ పవన్‌కుమార్‌రెడ్డి, బి.వి. నాయుడు, పెద్దనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకోవాలి

పెద్దమండ్యం: విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని కలిచెర్ల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భారతి అన్నారు. మండలంలోని వెలిగల్లు, కలిచెర్ల ఉన్నత పాఠశాలల్లో ఫోర్డ్, క్రై సంస్థల ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై శిక్షణ ఇచ్చేందుకు ముందుకు వచ్చిన సంస్థ సభ్యులను ఆమె అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర, సంస్థ కోఆర్డినేటర్ నరసింహులు పాల్గొన్నారు.

సీటీఎం తిరునాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

మదనపల్లె : మండలంలోని చిన్నతిప్పసముద్రం (సీటీఎం) శ్రీ నలవీర గంగాభవాని జాతర ఉత్సవ వేడుకలకు రావాలని ఎమ్మెల్యే నవాజ్‌బాషాకు సర్పంచ్‌లు ఆనందపార్థసారథి, బోర్‌వెల్‌మహేష్, నాయకులు వెలుగుచంద్ర ఆహ్వానం పలికారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్‌చైర్మన్ పొగాకువీరప్రతాప్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

పీలేరు రూరల్ : రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డ సంఘటన మండలంలోని శివరామపురం సమీపంలో చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. మండలంలోని రేగళ్లు పంచాయతీ కమ్మపల్లెకు చెందిన మధుసూదన్ (40) ద్విచక్ర వాహనంలో బుధవారం సాయంత్రం పీలేరు నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. తిరుపతి జిల్లా చిన్నగొట్టిగల్లుకు చెందిన శంకరమ్మ (43) సదుంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌గా పని చేస్తోంది. ఆమెతో పాటు భాస్కర్‌రెడ్డి ద్విచక్రవాహనంలో సదుం నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. అయితే మార్గం మధ్యలోని శివరామపురం వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ప్రమాదంలో మధుసూదన్, శంకరమ్మ తీవ్రంగా గాయపడ్డారు. వారిని పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్‌చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లుఎస్‌ఐ నరసింహుడు తెలిపారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



చర్విత్‌ను అభినందిస్తున్న ఎంఈఓ

ములకలచెరువు: మండలంలోని శ్రీ శారద విద్యా మందిర్ పాఠశాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న సి.చర్విత్ జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఎంఈఓ వెంకటరమణ, పాఠశాల కరస్పాండెంట్ సనత్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ నెలలో కాకినాడ పీఆర్ కళాశాల మైదానంలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ -14 బాలుర బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభకనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మార్సీలో సి.చర్విత్‌ను అభినందించారు.

వేగవంతంగా భూముల రీసర్వే

పెద్దతిప్పసముద్రం: భూముల రీ సర్వేను అధికారులు వేగవంతం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం మండల కేంద్రంలో డ్రోన్ ద్వారా భూ సర్వే నిర్వహించారు. తహసీల్దార్ విద్యా సాగర్, సర్వేయర్ రఫీ, ఆర్‌ఐ అనీషాలతో పాటు వీఆర్వోలు సర్వేలో పాల్గొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ సర్వే సమయంలో క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలను అక్కడిక్కడే పరిష్కరించి భూమికి ఖచ్చితమైన కొలతలను చూపించాలన్నారు. రీ సర్వేకు సంబంధించిన రైతులకు ముందుకు నోటీసులు జారీ చేసి అవగాహన కల్పించాల

93 శాతం పెన్షన్లు పంపిణీ

పీలేరు రూరల్ : వైఎస్సార్ పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా బుధవారం 93 శాతం పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ డాక్టర్ మురళీమోహన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మొత్తం 9630 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా ఈ నెల మొదటి రోజే 93 శాతం పూర్తి చేసినట్లు తెలిపారు.

ఉద్యాన పంటల సేకరణ కేంద్రాలకు రాయితీ

– జిల్లా ఉద్యాన శాఖాధికారి రవిచంద్రబాబు



మాట్లాడుతున ఉద్యాన శాఖాధికారి రవిచంద్రబాబు

కేవీపల్లె/పీలేరు రూరల్ : ఉద్యాన పంటల సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసే రైతు సంఘాలకు ప్రభుత్వం 75 శాతం రాయితీ ఇస్తున్నట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్రబాబు అన్నారు. బుధవారం కేవీపల్లె మండలంలోని సొరకాయలపేటలో భూమాత రైతు సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. అలాగే పీలేరు సీఎల్‌ఆర్‌సీలో రైతు సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొరకాయలపేటలో భూమాత రైతు సంఘంలో 600 మంది సభ్యులు ఉన్నప్పటికీ సంఘం తరపున చేపట్టాల్సిన కార్యకలాపాలు జరగడం లేదన్నారు. ఇకపై సంఘాన్ని బలోపేతం చేయడానికి రైతులు ముందుకు రావాలన్నారు. వంద మంది సభ్యులు కలిగిన రైతు సంఘానికి రూ. 15 లక్షలతో కలెక్షన్ సెంటర్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇది రైతులకు ఒక సువర్ణావకాశమని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం రూ. 11.25 లక్షలు రాయితీ ఇస్తోందని, మిగిలిన రూ. 3.75 లక్షలు రైతు సంఘం వాటా చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. ఉద్యానశాఖ అధికారి సుకుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దాన గుణం అలవాటు చేసుకోవాలి



కలకడలో అన్నదానం చేస్తున్న శ్రీలత తదితరులు

కలకడ : ప్రతి ఒక్కరూ దాన గుణం అలవాటు చేసుకోవాలని రాష్ట్ర తొగటవీరక్షత్రియ సేవాసంఘం మహిళా అధ్యక్షురాలు సురువు శ్రీలత అన్నారు. బుధవారం దివ్యజ్ఞానానందగిరి స్వామి జన్మదినం పురస్కరించుకుని కలకడ శ్రీచౌడేశ్వరిదేవిఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఉన్న తొగటవీరక్షత్రియులందరికీ కులగురువు దివ్యజ్ఞానానందగిరి స్వామిజీ ఆశీస్సులు అందాలని కోరారు. రాష్ట్రంలోని చేనేతకార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించే విధంగా సంఘాలు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం రాయలసీమ ఉపాధ్యక్షుడు సురువు మధుసూదన్, చేనేత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్ర వెంకట్రమణ, జీపుల క్రిష్ణ, రెడ్డెప్ప, జయరాము, ప్రసాద్, ఓబులేసు, రామకృష్ణ, బాబు, సంజీవ, సుబ్బరాయుడు, ఆంజినేయులు పాల్గొన్నారు.

శ్రీవేణుగోపాలస్వామి అవతారంలో జనార్ధనస్వామి



రామసముద్రం: మండల కేంద్రంలో వెలసిన శ్రీలక్ష్మీ జనార్ధనస్వామి బ్రహ్మరథోత్సవంలో భాగంగా బుధవారం స్వామివారు శ్రీవేణుగోపాలస్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు , కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు పార్థసారధి భట్టర్, కులశేఖర్‌భట్టర్ భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు .సాయంత్రం స్వామివారికి ఉంజలసేవ నిర్వహించారు.

ఉపాధి పనిదినాల కల్పనలో అగ్రస్థానం



మాట్లాడుతున్న ఏపీడీ నందకుమార్

బి.కొత్తకోట: వైఎస్సార్-జగనన్న కాలనీల్లో పేదలకు ప్రభుత్వం మంజూరు చేసి ఇళ్లకు ఉపాధి పనిదినాల కల్పనలో తంబళ్లపల్లె మొదటి స్థానంలో ఉందని డ్వామా ఏపీడీ నందకుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో క్షేత్రసహాయకులు, సాంకేతిక సహాయకులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ఒక్కో ఇంటి నిర్మాణానికి 90 రోజుల పనిదినాలు కల్పిస్తున్నామన్నారు. ఇలా జిల్లాలో ఇప్పటివరకు 11 లక్షల పనిదినాలు కల్పించగా, ఒక్క తంబళ్లపల్లె నియోజకవర్గంలో 4.11 లక్షల పనిదినాలు కల్పించామని చెప్పారు. నియోజకవర్గంలో 6,300 ఇళ్లకు ఉపాధి పనులు కల్పిస్తుండగా, 460 ఇళ్లకు 90 రోజుల పనిదినాలు పూర్తి చేశామన్నారు. బి.కొత్తకోట మండలంలో ఉపాధి పనుల సంఖ్య పెంచి కూలీలకు పనులు కల్పించాలని సిబ్బందిని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలి

గుర్రంకొండ: క్రీడాకారులు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ ఆటల పోటీల్లో రాణించాలని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి వసంతమ్మ అన్నారు. మండలంలోని తరిగొండ జెడ్పీహైస్కూల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-14 బాస్కెట్‌బాల్ బాలబాలికల జట్ల క్రీడాకారులకు రాష్ట్ర స్థాయిలో జరిగే ఎస్‌జీఎఫ్ పోటీలకు ఇక్కడ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. బుధవారం మదనపల్లెకు చెందిన ఎమర్జెన్సీ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు శ్రీధర్‌రెడ్డి క్రీడాకారులకు క్రీడా దుస్తులను విరాళంగా అందజేశారు.

పట్టాదారు పుస్తకాలు ఇవ్వాలని వినతి



సమస్యలను తెలుసుకొంటున్న అధికారులు

గుర్రంకొండ: సాగు భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని తహసీల్దార్ ఖాజాబీకి దళితులు విన్నవించుకొన్నారు. బుధవారం మండలంలోని ఎల్లుట్ల దళితవాడలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా దళితుల సమస్యలపై అక్కడ గ్రామసభ నిర్వహించారు. దళితులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో పలువురు దళితులు తరతరాలుగా భూములు సాగుచేసుకొంటున్నాం.. పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని కోరారు. భూములను సర్వేచేసి సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో రెడ్డిజవహర్, డీటీ నాగరాజ, ఆర్‌ఐ చంద్రశేఖర్, పీఆర్‌ఎఈ జావీద్, వీఆర్‌ఓ వెంకట్రమణ పాల్గొన్నారు.

అర్చకుని కుటుంబానికి ఆపన్నహస్తం



చెక్కు అందజేస్తున బ్రాహ్మణ సేవా సంఘం నాయకులు

మదనపల్లె సిటీ: అనారోగ్యంతో మృతి చెందిన అర్చకులు చంద్రశేఖరశర్మ కుటుంబానికి బుధవారం శంకర బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆపన్నహస్తం కింద రూ.లక్ష చెక్కును అందజేశారు. సంఘం ప్రతినిధులు కలిసి లక్ష రూపాయలు విరాళం సేకరించారు. అర్చకుని భార్య పద్మావతి ఆదుకోవాలని సంఘం అధ్యక్షులు కోదండరామయ్య కోరారు. ఆమె కూడా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు ప్రసాదరావు, కార్యదర్శి సుబ్రమణ్యం, రఘనందనరావు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి



ఆధార్ సేవలను పరిశీలిస్తున్న కమలాకర్‌రెడ్డి

కలకడ : సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జిఎస్‌డబ్ల్యూ ఎస్ ఇన్‌చార్జ్ మనోహర్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ సచివాలయంలో ఆధార్ సేవలను ప్రారంభించారు. నూతన ఆధార్‌కార్డు మంజూరు, సవరణలు ఇతరత్ర సేవలను సచివాలయంలోనే చేసుకునే సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాము, ఎంపీడీఓ నారాయణ, పంచాయతీ కార్యదర్శి నందిని, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

మదనపల్లె : గురుకుల పాఠశాలలోని విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రతతో పాటుగా తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సీడీపీఓ సుజాత, డాక్టర్ సల్మాన్‌ఖాన్, ఎంఈఓ ప్రభాకరరెడ్డి తెలిపారు. శనివారం చంద్రా కాలనీలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలను వారు సందర్శించారు. విద్యార్థినుల ఆరోగ్యంపై వాకబు చేశారు. పాఠశాలలోని 570 మంది విద్యార్థినులకుగాను 20 మంది చిన్నపాటి అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించారు. వారికి ఆరోగ్యపరీక్షలు నిర్వహించారు.